# 33. డింగుటకా ఢిం, ఓ, డింగుటకా!

**క**న్యాశుల్కం నాటకంలో గిరీశం వెంకటేశంతో పల్లెటూరికి ప్రయాణం అవుతూ శిష్యుడికి ఓ చిట్కా చెప్తాడు. "మీ వాళ్లు నిన్ను నీ కొచ్చిన ఇంగ్లీషుగాని మాట్లాడమని అడిగితే నోటికొచ్చింది ఏదో ఒకటి జంకూ కొంకూ లేకుండా మాట్లాడెయ్యి, అంతే" అని. అనుకున్నట్టుగానే పల్లెటూళ్లో ఆ టెస్ట్ ఎదురవుతుంది. అప్పుడు గిరీశం వెంకటేశం బొత్తిగా సందర్భం లేని వాక్యాలు ఇంగ్లీషులో జోరుగా మాట్లాడేసుకుని వెంకటేశం తల్లిదండ్రుల్ని విభ్రమలో ముంచేస్తారు. సడన్‌గా అగ్నిహోత్రావధాన్లు "ఇప్పుడు మీరాడుతున్న మాటలకి అర్థం ఏమిటండీ" అని గిరీశాన్ని అడుగుతాడు గాని. గిరీశం చెక్కు చెదరకుండా "ఈ సెలవల్లో పాఠాలు ఏ ప్రకారం చదవాలో అదంతా మాట్లాడుకున్నాం" అని చెప్పేస్తాడు.

రామనారాయణ దగ్గిర నేనలా చెప్పడానికి వీల్లేకపోయింది. సంగతేమిటంటే, రామ నారాయణ వారం రోజుల కిందట (అమెరికా నుంచి) ఢిల్లీ వచ్చాడు. విశాఖపట్నంలో అతనికి తాతల నాటిది ఒక ఇల్లు. ఆ నాటిదే ఒక దిక్కు లేని మేనత్తకూడా ఉండడం వల్ల ఆ ఇల్లు ఏదో కాడికి అమ్మేసి ఆ డబ్బును ఆ మేనత్త పేరిట నెలనెలా వడ్డీ వచ్చే విధంగా ఏదైనా బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్టుగా వేసీమన్నాడు. "బేరం సెటిల్ చేసేను, పార్టీ రడీగా ఉన్నాడు, కాని, నువ్వు ఎలాగో ఒకలాగ ఖాళీ చేసుకుని ఫలానా తేదీని ఈ వూళ్లో ఉంటే రిజిస్ట్రారు ఆఫీసులోనూ, బ్యాంకులోనూ సంతకాలు పెట్టేసి వెళ్లొచ్చు. పన్లోపనిగా మీ మేనత్త గారికి ఇదంతా నువ్వే చేస్తున్నావన్న భావన కలగడం కోసం కూడా నువ్విక్కడకి రావాలి. ఫవరాఫ్ ఎటార్నీ వున్నా సరే నేనే ఇవన్నీ చెయ్యడం బావుండదు." అని మెసేజి ఇచ్చేసరికి అనుకున్న దానికి ఒకరోజు ముందుగానే వైజాగ్ వచ్చేశాడు. "ఇండియాకి నాలుగేళ్ళకోసారి వస్తున్నా విశాఖపట్నం రావడం ఇరవై ఐదేళ్ల తరవాత కదా, సరదాగా ఓ తెలుగు సినిమా చూద్దాం. ఎలాగా పార్టీ ఇవాళ రెడీ కాడు రేపే రిజిస్ట్రేషన్ అంటున్నావు కదా" అంటూ నన్ను సినిమాకి లేవదీసుకుపోయాడు. "సుఖాన్నున్న ప్రాణానికి దుఃఖం తెచ్చిపెట్టేవుకదురా!" అనుకుంటూ వెళ్లాను.

కొంతసేపు వరకూ మాట్లాడకుండా సినిమా చూసేడు. ఇంతట్లోకి తెరమీద ఒక పాటవొచ్చింది.

"డింగుటకా ఢిం! ఓహో, డింగుటకా!" అని వొచ్చింది ఆ పాటలో. అప్పుడు అడిగాడు రామనారాయణ. "ఈ పాటకి అర్థం ఏమిటీ" అని.

హీరో, హీరోయినూ ఆ పాటని మంచి ఊపులో పాడేస్తున్నారు. వెనకాల బోలెడు కోరస్సుంది. ఆ వెనకాల సుమారు 250 వాయిద్యాల ఘోష ఉంది. తెరమీద మోకాళ్లు వూపుతున్న మొగాళ్ల క్లోజప్పులూ, చేతులూ తలలూ వూపుతున్న ఆడవాళ్ల క్లోజప్పులూ వస్తున్నాయి తప్పా నటీనటుల మొహాల క్లోజప్పులు రావడం లేదు. ఒకవేళ వచ్చినా హీరోది వస్తుంది తప్ప హీరోయిన్‌కి క్లోజప్పు లేదు. క్లోజప్పులో కనబడ్డ హీరో మొహంలో ఏ హావభావ ప్రదర్శన ఉండడం లేదు. కళ్లు ఎగరేస్తున్నట్లో , ఇంకా మాటాడితే కన్ను కొట్టినట్టో చూపిస్తున్నారు.

అప్పుడు అడిగాడు రామనారాయణ, ఈ పాటకి అర్థం ఏమిటీ- అని. మనసున మల్లెల మాలలూగెనే అంటే అర్థం చెప్పొచ్చు. కుడి ఎడమైతే పొరపాటులేదోయ్ కీ చెప్పొచ్చు. డింగుటకా ఢిం! ఓ, డింగుటకా అంటే అర్థం చెప్పడం చాలా కష్టం అనిపించి నాక్కోపం వచ్చింది. "నేను ముందే చెప్పేను - సినీమాకి వొద్దు, ఇంట్లో కూచుని కబుర్లు చెప్పుకుందాం రా అని, నువ్వే నన్ను బలవంతంగా తీసుకొచ్చేవు" అన్నాను విషాదంగా.

"ఇప్పుడేం జరిగిందని, నీ యిది?" అన్నాడు రామనారాయణ. "మనం ఏదో వినోదం ఆశించి సినిమాకొచ్చేం. ఈ హాలువాళ్లకి మనం ఏనాడో బాకీ వున్న పదిహేను రూపాయలూ చెల్లించాం. నీకు సినిమా నచ్చకపోతే ఇంటికి పోదాం పద" అని కూడా అన్నాడు.

నేనింక ఆలస్యం చెయ్యకుండా లేచేను.

ఇంటికొచ్చేసరికి మా ఇంట్లో అందరూ వీడియో పెట్టుకుని సినిమా చూస్తున్నారు. మా ఇంట్లో వాళ్లే ఏమిటి, పక్క యింట్లో వాళ్లు, ఎదురింట్లో వాళ్లు కూడా కొందరున్నారు. హవుసు(ఇల్లు) ఫుల్ కాకపోయినా రూమ్ ఫుల్‌గా వుంది. రామనారాయణ మాకు వి.ఐ.పి గెస్టు కదా అని అతనికి ఉచితాసనం ఇచ్చేరు, ఎవరో లేచి నేల మీద కూచుంటూ.

ఈ సినిమాలో కూడా మోకాళ్ల నృత్యం. హీరో క్లోజప్పులు, క్రూరంగా చేసిన హత్య, నమ్మశక్యం కాని సామర్థ్యంతో ఒడుపుతో చేసిన ఫైట్లూ ఉన్నాయి.

"హీరో వేసిన అబ్బాయి పేరేమిటి?" అని అడిగాడు. రామనారాయణ.

మా మనవడు ఠకీమని చెప్పేశాడు.

"ఆ హీరోయిన్ పేరు?"

అంతకంటే స్పీడుగా చెప్పింది, మా పొరుగాయన ఆఖరి కూతురు.

"ఇందాక మనం హాల్లో చూసిన సినిమాలో కుర్రాడెవరు?"

"నాకతని పేరు జ్ఞాపకం లేదు కాని అతనొక పెద్ద ప్రొడ్యూసర్ కొడుకు" అన్నాను. మా కోడలు ఆ సినిమా పేరేమిటో కనుక్కొని, ఆ హీరో పేరు చెప్పింది. అందులో హీరోయిన్ పేరు కూడా చెప్పింది. పైగా, ఈ హీరో ఫలానా పాత హీరో కొడుకని, ఈ హీరోయిన్ ఫలానా పాత తమిళ హీరోకీ ఫలానా మలయాళ నటీమణికీ వాళ్లు విడిపోక ముందు పుట్టిన పిల్ల అనీ, ఆ హీరోయిన్ ఫలానా పాత తెలుగు డైరెక్టరుకీ అతని తమిళ ప్రియురాలికి పుట్టిన పిల్ల అనీ, ఈ కాసెట్ అయిపోగానే పెట్టుకోవడానికి సిద్ధంగా వున్న మరో దాంట్లో హీరో ఒక ఫలానా హాస్య నటుడి అల్లుడనిన్నీ ఎన్నో జన్మ రహస్యాలు, జాతక విశేషాలు వివరించింది.

"మా తాతగారికి, పెద్ద పెద్ద బైండు పుస్తకాలన్నీ అర్థమై పోతాయి గాని సినిమా నాలెడ్జి సున్నా." అన్నాడు మా మనవడు. "ఊరుకో వెధవా!" అని మా కోడలు నవ్వుతూ వాడి నెత్తిమీద ఒకటిచ్చుకుంది.

"అంటే ఎక్కువమంది హీరోయిన్లు తెలుగు వాళ్లు కాదన్న మాట" అన్నాడు రామ నారాయణ.

"కాదు గనకనే వాళ్ల నోళ్లంట ఆ రకం డైలాగులు ఎవరో డబ్బింగులు చెబుతున్నారు. వాళ్లు బూతులు చెబుతున్నారో, నీతులు చెబుతున్నారో వాళ్లకే తెలీదు." అని సంజాయిషీ

యిచ్చేను.

"ఏక్షన్ చేయించే ముందు ఫలానా భావం చూపించాలని డైరెక్టరు గారు చెప్పినప్పుడు కూడా వాళ్లకి సిగ్గెయ్యదా?"

"ఏక్షన్ అంటూ ఏమీ ఉండదు. ఉన్నా హీరోయిన్‌కి క్లోజప్ ఉండదు. అంతా స్పీడు. కొత్తరకం మోకాళ్ల డాన్సులు చెయ్యడం, డ్యూయెట్లు పాడినప్పుడు రొమాన్సు నటించడం అంటే కావలించుకోవడం, ముద్దులు పెట్టించుకున్నట్లు సజషన్ ఇవ్వడం, వొంకర్లూ, వొయ్యారాలూ పోవడం నేరిస్తే చాలు, హీరోయిన్ అయిపోతుంది. ఇహ మరీ కొండ స్లోపుల మీదా మంచు దిబ్బల మీదా హీరోతో సహా దొర్లవలసి వస్తే ఇద్దరికీ డూపులు రడీగా వుంటారు."

"పూర్వం కన్నాంబా, సావిత్రీ, అంజలీ, భానుమతీ, వాణిశ్రీ, జయసుధా వీళ్లంతా ఏక్షన్ కూడా చేసేవాళ్లు కదా. అలాంటి హీరోయిన్లు, అంటే నటన తెలిసిన వాళ్లు ఫీల్డులోకి రావడం లేదా?" అని అడిగాడు రామనారాయణ.

"హీరోయిన్ పాత్రలకొచ్చే అమ్మాయిల నటన అంతా కెమెరాలేని చోట్లకి పరిమితమైపోతుంది. అంటే ఇళ్లల్లోనూ, ఔట్‌డోర్ లొకేషన్స్ దగ్గిరుండే గెస్టుహౌసుల్లోను, పత్రికా విలేకర్ల సమావేశం లోను నటిస్తున్నారంతే. అసలు మోడర్న్ తెలుగు సినిమాకి హీరోయిన్ అనే పదార్థం అనవసరం అనే సంప్రదాయం ఒచ్చేస్తోంది. సినిమాలన్నీ నాయక ప్రధానంగా రూపొందుతున్నాయి."

"హీరో వేషాలకొచ్చేవాళ్లు బాగా చదువుకున్న వాళ్లలా ఉన్నారు కదా. పోనీ వాళ్లైనా నటనా ప్రతిభ చూపించొచ్చుకదా?"

"సున్నితమైన భావాల్ని మొహాల్లో చూపించుకుంటూ కాలక్షేపం చెయ్యడానికి టైమ్ లేదు. అంతా స్పీడు, స్పీడు! పిక్చరు స్పీడుగా తియ్యాలి. అది స్పీడుగా ఆడెయ్యాలి, స్పీడుగా డబ్బు వసూలు చెయ్యాలి. సన్నివేశాలూ, డైలాగులూ ఎంత క్రూరంగా జుగుప్సాకరంగా ఉంటే అంత పెద్ద హీరో అవుతాడు. మిల్లీస్టార్‌గా మొదలెట్టి స్టారవుతాడు. కిలో స్టార్ అయి మెగాస్టార్ అయి సెంటిలియన్ స్టార్ అవుతాడు. పదేళ్ల కెరియర్‌లో వెయ్యి సినిమాల్లో కనిపించాలి."

"అంటే, ఫలానా కథలో ఫలానాపాత్ర కోసం ఫలానా హీరో అని నిర్ణయించరా?"

"నో! చేతిలో ఉన్న పెట్టుబడిని బట్టి హీరో ఫలానా అని నిర్ణయిస్తారు. అతనికి తగ్గట్టుగా కథని మెడలు వంచి ఒడలు వంచి తయారుచేస్తారు. స్మగ్లింగ్, దేశద్రోహం, అత్యాచారాలు, హత్యలు, ఆధునిక మరణాయుధాల ప్రయోగం అన్నీ కూడా ఇంకో వందేళ్ల దాకా ఈ గడ్డ మీద సంభవించవనుకున్నవి రాత్రికి రాత్రి ప్లాన్‌చేసి కథలో ఇరికిస్తారు. సినిమా సక్సెస్ అవుతుంది."

"నాతో ఈ దురవస్థ అంతా ఇంత నిర్మొహమాటంగా చెప్తున్నావు కదా. ప్రపంచములోకెల్లా అత్యంత మిక్కిలి పెద్ద ప్రజాస్వామ్యం అయిన ఈ దేశంలో రాజ్యాంగం ప్రకారం భావ ప్రకటనా స్వాతంత్రం ఉంది కదా. మరి మీరంతా ఈ భావాల్ని మీలో మీరు ప్రకటించుకోలేరా?"

"మా దేశంలో భావ ప్రకటనా స్వాతంత్ర్యం కన్నా వ్యాపార ప్రకటనా స్వాతంత్ర్యం ఎక్కువ అనుకుంటాను. అందుకే అన్ని వూళ్లలోనూ గోడల నిండా ఇన్నిరకాల సినిమా బొమ్మలు!" అని రామనారాయణకి చెప్పేసి ముసుగేసుకుని పడుకున్నాను. ★